క్లుప్తంగా

పెరవలి ఎస్సైగా వెంకటేశ్వరరావు



పెరవలి: స్థానిక ఎస్సైగా ఎం. వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో పనిచేస్తూ పెరవలి ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి.అప్పారావు పేకాట కేసులో స్వాధీనం చేసుకున్న మొత్తంలో కొంత సొమ్ము గల్లంతు అయిన వ్యవహారంలో సస్పెండ్ చేశారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి సబ్ స్టేషన్ పరిధిలోని చివటం గ్రామానికి మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్టు విద్యుత్ శాఖ ఉండ్రాజవరం అధికారులు సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలదుర్గమ్మ గుడి వద్ద అన్నసమారాధన

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రారంభించారు. తొలుత అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు నాయకుడు విశ్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, జనసేన నాయకుడు మాధవరపు వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ

నల్లజర్ల: పార్డ్ ఇండియా ఆధ్వర్యంలో నల్లజర్లలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ కేంద్రంలోని మహిళలకు తాగునీరు అందించేందుకు రూ.10 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను పచ్చిగోళ్ళ శ్రీనివాస్ అనే దాత సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పార్డ్ ఇండియా సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి కూరపాటి నాగరాజు, బొందల శ్రీనివాసరావు, జీవీవీ ప్రసాద్, దూబగుంట్ల రాజారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రాకేష్



నిడదవోలు: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి దాసరి రాకేష్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక య్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో ఈనెల 14న నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో రాకేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో త్వరలో నెల్లూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రాకేష్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్ఎం గురునాథం సోమవారం తెలిపారు.

6 వరకూ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు

దేవరపల్లి: గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు నవంబరు 6వ తేదీతో గడువు ముగుస్తోందని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి సోమవారం తెలిపారు. ఓటు నమోదుకు ఫారం- 18తో డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నంబర్ జత పరచాలని ఆమె తెలిపారు. అక్టోబరు 21కి ముందు రెగ్యులర్ డిగ్రీ పొందిన వారు అర్హులని ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేయించుకునే వారు జిరాక్స్‌పై గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి సమీప నిర్దేశిత కేంద్రంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

పెదపూడి: రెండు చోరీ కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేశామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. అనపర్తిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనపర్తిలోని ఎంపీడీఓ ఆఫీస్ ఎదురుగా డి.వెంకటప్రసాద్, వెంకటలక్ష్మి జ్యూవెలరీ వర్క్‌షాపులో గత నెల 28న, అలాగే కుతుకులూరు గ్రామంలోని పి.వెంకటరెడ్డి ఇంట్లో ఈనెల 10వ తేదీన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో చోరీలకు పాల్పడిన రాయవరం మండలం వెదురుపాక రాయవరం గ్రామానికి చెందిన కట్టా శివ శంకర్‌ను ఈ నెల 20న అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 211 గ్రాముల వెండి, 12 గ్రాముల బంగారం ఆభరణాలు రికవరీ చేశారు. నిందితుడిపై సుమారు 50 వరకూ కేసులున్నట్టు వెల్లడించారు. అతడిని అరెస్ట్ చేసి అనపర్తి కోర్టులో హాజరుపరుగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

అన్నదాతా! సుఖీభవ లేనట్టేనా?

- ఖరీఫ్ ముగుస్తున్నా అందని పెట్టుబడి సాయం
- జగనన్న పాలనలో ఠంచన్‌గా రైతుభరోసా
- నేడు ఆ ఊసే ఎత్తని కూటమి సర్కార్



నల్లజర్ల: రైతన్నను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు అన్నివర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ సీజన్ చివరకు వచ్చినా ఇంతవరకూ రైతులకు పెట్టుబడి సాయం అందనే లేదు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేల చొప్పున అందిస్తామని ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయితే గద్దె నెక్కిన సీఎం చంద్రబాబు ఈ హామీని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని రైతులు విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతుభరోసా పథకాన్ని కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ అని పేరు మార్చడం తప్ప ఎక్కడా అమలు చేయలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ఖరీఫ్ సీజను ముగింపునకు వచ్చినప్పటికీ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. సాగుకు పెట్టుబడులు లేక రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఏటా సీజన్‌కు ముందే రైతుభరోసా పథకం ద్వారా అన్నదాతలకు పెట్టుబడి సాయం అందజేసింది. ఏటా మండలంలో 49,212 మంది రైతులకు రైతుభరోసా పథకం కింద ఒక్కో రైతు ఖాతాకు రూ.13,500 వంతున రూ.53.19 కోట్లు చెల్లించేది. ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500, రబీ అవసరాల కోసం అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో పంట కోతల సమయంలో రూ. 2 వేల చొప్పున ఠంచన్‌గా రైతుల ఖాతాలకు జమ చేస్తూ వారికి అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకాన్ని అన్నదాతా సుఖీభవగా పేరు మార్చి ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామన్న చెప్పిన చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక ఆ విషయాన్నే ఎక్కడ ప్రస్తావించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. దీంతో రైతులు సాగుకు పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

పెట్టుబడికి ఇబ్బందులు



జగనన్న పాలనలో ఏటా పెట్టుబడి సాయంగా రైతుభరోసా డబ్బులు వచ్చేవి. అవి పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. పంటల సాగుకయ్యే పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేస్తే మంచిది.

– వల్లూరి వెంకటేశ్వరరావు, రైతు,నల్లజర్ల

అప్పులు చేస్తున్నాం



ఈఏడాది రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందక ఖరీఫ్ పెట్టుబడికి అందిన చోటల్లా రైతులు అప్పులు చేసారు. గత ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేస్తే బాగుంటుంది.

– కోడూరి అర్జునరావు,రైతు,నల్లజర్ల

నంగాలమ్మ గుడిలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నంగాలమ్మ వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు తదితరులు

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల గ్రామంలోని నంగాలమ్మ వారి ఆలయం వద్ద నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వేడుక సోమవారం వైభవంగా జరిగింది. పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొన్నారు. నంగాలమ్మ వారిని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ నాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, రావిమెట్ల సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పులూరి తేజశ్రీ , పార్టీ నాయకులు చిలుకూరి చిట్టిప్రసాద్, కత్తినొక్కుల మురళీకృష్ణ, ఉప్పులూరి రామకృష్ణ, కాల్దారి శ్రీను, అరవాల రాజు, బూరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణం వేగవంతం చేయండి



మినీ గోకులాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: మినీ గోకులాల (పశువుల షెడ్లు) నిర్మాణం వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు సూచించారు. మినీ గోకులాల లబ్ధిదారులకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గారావు మాట్లాడారు. నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించాలని అధికారులకు సూచించారు. ఏపీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలానికి 27 యూనిట్లు మంజూరైర య్యాయన్నారు. యూనిట్ విలువ రూ.2.25 లక్షలు కాగా, 10 శాతం లబ్ధిదారుడు చెల్లించాలన్నారు. పశువుల పెంపకందారులకు షెడ్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి యూనిట్లు మంజూరైనట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, రైతులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆలయాలకు ధూప,దీప నైవేద్యం కిట్లు



నల్లజర్ల అంబేడ్కర్ కాలనీ రామాలయానికి కిట్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

నల్లజర్ల: 'గ్రామ దేవతల ఆలయాలను పునరుద్ధరించుకుందాం–దేశ సంస్కృతిని కాపాడుకుందాం' అనే నినాదంతో దానధర్మ చారిటబుల్ ట్రస్టు పని చేస్తోందని ఆ ట్రస్టు సభ్యుడు పాతకోకల వెంకట్ తెలిపారు. మండలంలోని నల్లజర్ల, జగన్నాథపురం , తెలికిచెర్ల, కమతంగుంట, మార్లెళ్లమూడి, పుల్లపాడు గ్రామాల ఎస్సీ, బీసీ ఏరియాల్లోని ఆలయాలకు సోమవారం ఆయన ధూపదీప, నైవేద్యం కిట్లు అందజేశారు. తమ ట్రస్టు ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షా 50 వేల ఆలయాలకు ఈ కిట్లు అందజేయనున్నట్టు వెంకట్ చెప్పారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నల్లజర్ల శాఖ అధ్యక్షుడు మాయలేడి తాతారావు, మండల భజరంగ్ దళ్ ఉపాధ్యక్షుడు సవలం రామకృష్ణ, గుడెం వెంట సుబ్బారావు, బొందల శ్రీనివాసరావు, గారపాటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ మరుగుదొడ్లు తొలగించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న చర్చిపేట యూత్

నిడదవోలు: స్థానిక ఏడో వార్డు సచివాలయం పక్కనే ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లను తొలగించాలనే డిమాండ్‌తో అక్కడి చర్చ్‌పేట యువత సోమవారం ధర్నా చేసింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ సుమారు 3 వేల మంది దళితులు, మైనార్టీలు, బీసీలు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలోని పబ్లిక్ మరుగుదొడ్లు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. వర్షాకాలంలో ఆ ప్రాంతం అంతా మునిగిపోయి మరుగుదొడ్లలోని మల మూత్రాలు బయటకు వస్తుండడంతో ఇక్కడి వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉంటున్న ఈ మరుగుదొడ్లలో రాత్రిపూట కొందరు బయట వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు తొలగించి ఆ స్థలంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మోషే , ఎల్లే పండు, మద్రిపూడి రాజేష్, దాకే సతీష్, నల్లా రాంబాబు, పిట్టా నాగరాజు, అశోక్, నల్లా లెనిన్, తలారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు, రొట్టెలు పంచుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కొవ్వూరు 22వ వార్డులో పిడుగు పాటుతో దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

కొవ్వూరు: పట్టణంలోని 22వ వార్డు పోతురాజుదిబ్బ ప్రాంతంలో సోమవారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఆ సమయంలో భారీ శబ్దం రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. కొబ్బరిచెట్టు మొవ్వులో పిడుగు పడడంతో నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు.

బాధితులను పరామర్శించిన తలారి

పిడుగు పాటు వల్ల అస్వస్థతకు గురైన మండలంలోని పెనకనమెట్ట గ్రామానికి చెందిన ఎనిమిది మంది వ్యవసాయ కూలీలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. ఆ గ్రామంలో పలువురు కూలీలు ఈ నెల 19న పొలంలో పని చేస్తుండగా పిడుగుపడింది. పలువురు స్వల్పంగా గాయపడ్డారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది బాధితులను మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శించి, వారికి పండ్లు, రొట్టెలు అందజేశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. సిర్రా ఉత్తెమ్మ, బండి నాగమణి, కాట్రు నారాయణమ్మ, కడియం రాణి, కొక్కిరిపాటి సుజాత, చాపల కౌసల్య, పసలపూడి గన్నెమ్మ, కొక్కిరిపాటి లక్ష్మి గాయపడ్డారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున వెంకట్రావు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు కంఠమణి రమేష్‌బాబు, ఉప్పులూరి సూరిబాబు, తాడి బుల్లిరాజు, బండి మణికంఠ, తోరాటి సతీష్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక తవ్వకాలు ప్రారంభం



కానూరు-పెండ్యాల ర్యాంపులో కూలీలతో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్

పెరవలి: మండలంలోని గోదావరి రేవుల్లో సోమవారం ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. రెండెడ్ల బండ్లు, ట్రాక్టర్లపై ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసుక తీసుకు వెళ్లవచ్చని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో ర్యాంపుల నుంచి ఇసుకను కూలీలతో వందలాది ట్రాక్టర్లకు లోడ్ చేయించి ఎగుమతులు చేశారు. మండలంలోని కానూరు–పెండ్యాల, తీపర్రు ఇసుక ర్యాంపుల్లో సోమవారం కూలీలతో ఇసుక ఎగుమతులు చేశారు. ఈ రెండు ర్యాంపుల నుంచి పూర్తిస్థాయిలో ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తే భవన నిర్మాణ అవసరాలకు ఇసుక కొరత తీరుతుంది. ప్రస్తుతం ఇసుక కోసం వచ్చే ట్రాక్టర్ల వద్ద నుంచి బాట ఖర్చు, ఎగుమతి కూలీ కింద రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు. ర్యాంపుల్లోకి లారీలు వెళ్లకూడదని మైనింగ్ చట్టం స్పష్టం చేస్తుండడంతో కేవలం ట్రాక్టర్ల ద్వారానే ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వ ర్యాంపుల నుంచి కూలీలతో మాత్రమే ఇసుక తీయించి, ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుక స్టాక్ యార్డులకు తరలించాలి. ఇదే క్రమంలో గతంలో నిల్వ ఉంచిన గుట్టల వద్ద నుంచి ఇసుకను లారీలపై ఎగుమతి చేస్తున్నారు. గోదావరిలో నీటి ప్రవాహం ఉండడంతో మరో వారం రోజుల వరకూ గరుకు ఇసుక లభ్యం కాదని చెబుతున్నారు. ఉచిత ఇసుక ప్రస్తుతం జోరుగా సాగుతున్నా రాజకీయ నాయకులు ప్రవేశం జరిగితే ఇది కూడ గాడి తప్పవచ్చని అంటున్నారు.

కుంభాభిషేకం, శతచండీ హోమం ప్రారంభం



యాగశాలలో మహా కుంభాభిషేక మహోత్సవ పూజలు చేస్తున్న వేద పండితులు

తాళ్లపూడి: స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం మహా కుంభాభిషేకం మహోత్సవాలు, శత చండీ యాగం పూజలు ప్రారంభమయ్యాయి. శతాధిక ప్రతిష్ఠా సిద్ధాంతి సిద్ధేశ్వర శ్రీకార్తికేయ శివాచార్య గురువు ఆధ్వర్యంలో ఈ క్రతువులు జరుగుతున్నాయి. ఆలయ అర్చకుడు అల్లూరి ప్రసాద్ పర్యవేక్షణలో వేద పండితులు యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణ, గోపూజ, యాగశాల ప్రవేశం, అంకుర్పాణ, మూలమంత్ర హోమాలు, ప్రధాన కుంభ వాహన చండీ పారాయణం, అగ్ని ప్రతిష్ఠాపన, ప్రధాన దేవతా మూల మంత్ర హోమాలు, ధ్వజరోహణ తదితర పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజల్లో పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



నిడదవోలు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు



గోపాలపురంలో పోలీసు అమర వీరుల సంస్మరణ ర్యాలీ

కొవ్వూరు: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక విజయ విహార్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు, ఏఎస్సై జీజీ ప్రకాశ్ ఇతర సిబ్బంది, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ అమర వీరులకు నివాళులర్పిస్తూ మానవహారం నిర్వహించారు.

గోపాలపురం: దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నుంచి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక చెక్ పోస్టు సెంటర్ వద్ద వారంతా మానవహారంగా ఏర్పడ్డారు. పోలీసు అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎస్సై కర్రి సతీష్‌కుమార్, ఏఎస్సై కె.శోభనాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి చాగల్లులో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీర్రాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరులైన పోలీసులకు సిబ్బంది నివాళి అర్పించారు. ఏఎస్ఐ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నుంచి నల్లజర్ల సెంటర్ వరకూ విద్యార్థులతో కలసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. సెంటర్లో మానవహారంగా ఏర్పడి పోలీసు అమరువీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

తాళ్లపూడి: స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, ఇతర ప్రముఖులతో కలిసి తాళ్లపూడిలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద 'అమర్ రహే పోలీసు అమర వీర జవాన్లు' అంటూ నినాదాలు చేశారు.

ఉండ్రాజవరం: స్థానిక ఎస్సై గుబ్బల శ్రీనివాసురావు ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి పోలీసులు ఉండ్రాజవరం సెంటర్ నుంచి ఉన్నత పాఠశాల వరకూ ర్యాలీ చేశారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాలు

కొవ్వూరు: ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. 22న వాడపల్లి–1, వేములూరు, పెనకనమెట్ట, ఐ.పంగిడి–1 సచివాలయాల్లోను, 23న బంగారమ్మపేట, దొమ్మేరు సావరం, వేములూరు, ఐ.పంగిడి–1 సచివాలయాల్లోనూ ఈ కేంద్రాలు పని చేస్తాయన్నారు. అలాగే 24న మద్దూరు, దొమ్మేరు, తోగుమ్మి, ధర్మవరంలోను, 25న తోగుమ్మి, దొమ్మేరు, నందమూరు, కాపవరం సచివాలయాల్లోనూ ఆధార్ నమోదు కేంద్రాలు పని చేస్తాయన్నారు. కొవ్వూరు పట్టణంలో నాలుగు ఆధార్ అప్‌డేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం శ్రీరామ కాలనీ సచివాలయంలోను, 23న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, 24న పీఎంఎంఎం (మునిసిపల్) హైస్కూల్లోను, 25న ఇందిరమ్మ కాలనీలోని తొమ్మిదో నంబర్ సచివాలయంలోను ఇవి పనిచేస్తాయన్నారు.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం సచివాలయం–2 వద్ద ఈనెల 22 నుంచి 25 వరకూ ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కేంద్రం వద్ద ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

పెరవలి: ముక్కామల ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఈ నెల 25 వరకు ఆధార్ నమోదు శిబిరం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ తెలిపారు.

తాళ్లపూడి: మంగళవారం తాళ్లపూడి, మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద, 23న తాళ్లపూడి ప్రత్యేక ప్రాథమిక పాఠశాల వద్ద, పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆధార్ నమోదు శిబిరాలు పనిచేస్తాయన్నారు. 24న వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద, రావూరుపాడు గ్రామస్తులకు పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద, 25న వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయి.

